సాక్షి కర్నూలు
శుక్రవారం ౹ 25 ౹ జూలై ౹ 2025



శ్రావణం వచ్చింది..

శ్రావణ మాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ మాసంలో చేసే పూజలు, వ్రతాలు, నోములు శుభ ఫలితాలను ఇస్తాయని భక్తుల విశ్వాసం. 8లో▸



పొలాల్లో చిరుత సంచారం

గోనెగండ్ల మండలం ఎన్నెకండ్ల, గంజిహళ్లి గ్రామాల శివారుల్లోని పొలాల్లో చిరుత పులి సంచారిస్తోంది. పొలాలకు వెళ్లేందుకు రైతులు భయపడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.53
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:78.239
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:26,291
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:30,262

న్యూస్‌రీల్

పీఎంఏజీవై గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టండి

కర్నూలు(సెంట్రల్): పీఎంఏజీవై(ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన) పథకం కింద ఎంపికైన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పీఎంఏజీవై అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫేజ్–2 కింద ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రతిపాదించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీల మరమ్మతులు, తాగునీటికి సంబంధిచి ఫిల్టర్ బెడ్‌లు, పీఆర్‌కు సంబంధించి రోడ్లు, మౌలిక వసతులు తదితరాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సమావేశంలో జేడ్పీ సీఈఓ నాసరరెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రాధిక, ఇరిగేషన్ ఎస్‌ఈ ఈ.బాలచంద్రారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, విద్యుత్ ఎస్‌ఈ ఉమాపతి, అదనపు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ భాస్కరరాజు పాల్గొన్నారు.

ఉరుకుందలో 'నవో'దయం

- ప్రారంభమైన 9 వారాలు, 9 ప్రదక్షిణలు



ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై నుంచి వస్తున్న భక్తులు పరిశీలిస్తున్న డీసీ

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్నస్వామి దేవాలయంలో శుక్రవారం నుంచి శ్రావణ మాస ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో దేవాలయంలో గురువారం ప్రత్యేకంగా 9 వారాలు, 9 ప్రదక్షిణల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం అమావాస్య, ఆషాఢ మాసం చివరి రోజు కావడంతో మహాలక్ష్మి అమ్మవారికి భక్తులు శాస్త్రోక్తంగా సారెను సమర్పించారు. పిండివంటలతో స్వామికి నైవేద్యం సమర్పించారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప ఆర్టీసీ డిపోలవారు ప్రత్యేక బస్సులను నడిపారు.

జిల్లాలో 1,930 మెట్రిక్ టన్నుల యూరియా

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో 1,930 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతలో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జాయింట్ కలెక్టర్ బి.నవ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్ వద్ద 491.4 మెట్రిక్ టన్నులు, రైతు సేవా కేంద్రాల వద్ద 399.67 మెట్రిక్ టన్నులు, రిటైలర్స్ దగ్గర 984 మెట్రిక్ టన్నులు, సహకార సంఘాలు, మార్కెటింగ్ సొసైటీల దగ్గర 54.535 మెట్రిక్ టన్నుల యూరియా ఉందన్నారు. జిల్లాలో ఖరీఫ్ సాధారణ వర్షపాతం 401.1 మి.మీ కాగా ఇప్పటి వరకు 141.3 మి.మీ., వర్షపాతం నమోదైందన్నారు. ఖరీఫ్–2025లో సాధారణ పంట విస్తీర్ణం 4,22,510 హెక్టార్లు కాగా.. పత్తి, వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, మినుము, ఉల్లి, మిరప తదితర ప్రధాన పంటలు సాగు చేస్తారన్నారు. అయితే ఇప్పటి వరకు 2,19,875 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే పంటలు సాగయ్యాయని, ఇందులో ప్రధానంగా పత్తి 1,63,792 హెక్టార్లలో సాగైనట్లు పేర్కొన్నారు.

జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కొనసాగుతున్నాయి. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు చిప్పగిరి, ఆలూరు, హొళగుంద, హాలహర్వి మండలాలు మినహా మిగిలిన అన్ని మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తంగా సగటున 8 మి.మీ వర్షం కురిసింది. జూలై నెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ ఉండగా.. ఇప్పటి వరకు 75 మి.మీ వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజుల్లో వివిధ మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

గున్యా వణికిస్తూ.. డెంగీ కబళిస్తూ!



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వైద్యపరీక్షల కోసం వేచి ఉన్న రోగులు

- భయపెడుతున్న జ్వరాలు
- ఇప్పటికే 20 మందికి బోదకాల వ్యాధి
- ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందని వైద్యం
- ప్రైవేట్ హాస్పిటళ్లలో ఫీజుల దోపిడీ!
- కనిపించని ఫీవర్ సర్వే
- స్పందించని 'కూటమి' ప్రభుత్వం

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో వైరల్ ఫీవర్లు, సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. దీంతో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఇదే సమయంలో తాగునీరు కలుషితమై టైఫాయిడ్ వంటి జ్వరాలు పీడిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో చాలా చోట్ల వైద్యులు, సిబ్బంది లేకపోవడం, అవసరమైన పరికరాలు, పరీక్షలు చేయకపోవడంతో పట్టణాలకు వెళ్తున్నారు. మరికొందరు స్థానికంగా ఆర్‌ఎంపీలను ఆశ్రయించి వైద్యం చేయించుకుంటున్నారు. జిల్లాలో 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు ఐదు సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆసుపత్రులు, 26 అర్బన్ హెల్త్ సెంటర్లు, కర్నూలులో ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఉన్నాయి. ఆయా ఆసుపత్రులకు ఇటీవల కాలంలో జ్వరపీడితులు అధికమయ్యారు. ఈ యేడాది ఇప్పటి వరకు 11 మంది చికున్‌గున్యా వ్యాధి బారిన పడ్డారు. ఇందులో అత్యధికంగా పత్తికొండ డివిజన్‌లో 10 కేసులు ఉన్నాయి. దీంతో పాటు బోదకాలు కేసులు సైతం పెరుగుతున్నాయి. ఐదు నెలల కాలానికే ఈ యేడాది 20 మంది కొత్తగా ఈ వ్యాధి బారిన పడటం ఆందోళన కలిగిస్తోంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు ప్రతిరోజూ ఓపీ రోగుల సంఖ్య 2,500ల నుంచి 3,000 ఉంటోంది. ఇందులో అధిక శాతం జ్వరాల కేసులే ఉంటున్నాయి.

అందని ప్రభుత్వ వైద్యం

- ➡ గూడూరు ప్రభుత్వ ఆసుపత్రిలో స్పెషలిస్టు వైద్యులు లేకపోవడంతో రోగులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు వెళ్తున్నారు.
- ➡ పోలకల్ పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లకు గాను ఒక రెగ్యులర్, మరొకరు ఇన్‌ఛార్జి ఉన్నారు. మరో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉంది.
- ➡ సి.బెళగల్ పీహెచ్‌సీలో ఇద్దరు రెగ్యులర్ డాక్టర్లు ఉన్నప్పటికీ సమయానికి రావడం లేదు.

» కర్నూలు నగరంలోని కల్లూరు ఎస్టేట్ ప్రాంతానికి చెందిన ఓ యువతి వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది.

» నందవరం మండలానికి చెందిన ఆనందమ్మ అనే మహిళ ఈ నెల 12వ తేది నుంచి డెంగీ జ్వర లక్షణాలతో బాధపడుతూ ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందారు. అక్కడి నుంచి కర్నూలుకు రెఫర్ చేయగా చికిత్స పొందుతూ కోలుకోలేక 15వ తేదిన ఆమె మృతి చెందింది.



గోనెగండ్ల పీహెచ్‌సీలో చికిత్స కోసం వేచి ఉన్న రోగులు

- ➡ ఎమ్మిగనూరు పట్టణంలోని వంద పడకల ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- ➡ తుగ్గలి పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఇద్దరు వైద్యులు ఉన్నత చదువుల కోసం నాలుగు నెలల క్రితం వెళ్లారు. దీంతో పగిడిరాయి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఆమె కూడా ఇటీవల బదిలీపై వెళ్లడంతో పగిడిరాయిలో పనిచేస్తున్న మరో వైద్యుడు తుగ్గలి, పగిడిరాయి పీహెచ్‌సీలలో రోగులకు వైద్యం అందించాల్సి వస్తోంది.
- ➡ గోనెగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి ప్రతిరోజూ వంద నుంచి 120 మంది ఓపీ రోగులు వస్తున్నారు. ఇక్కడ అంతంతమాత్రమే చికిత్స అందుతుండటంతో చాలా మంది ఎమ్మిగనూరు, కర్నూలుకు వెళ్తున్నారు. మరికొందరు స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు.
- ➡ ఆస్పరి పీహెచ్‌సీలో నలుగురు మెడికల్ ఆఫీసర్లకు గాను ఇద్దరు సెలవులో వెళ్లారు.
- ➡ దేవనకొండ పీహెచ్‌సీలో ప్రతిరోజూ వంద నుంచి 110 మంది దాకా ఓపీకి రోగులు వస్తున్నారు. ల్యాబ్‌టెక్నీషియన్ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు.
- ➡ హాలహర్వి మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నాయి. నలుగురు డాక్టర్లుండగా ఇద్దరు మాత్రమే ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.

వ్యాధులను తగ్గించి చూపుతున్నారా?

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు జ్వరం, అతిసార లక్షణాలతో చికిత్స కోసం వెళ్తున్నారు. మరోవైపు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు వైద్యుల వద్దకు కూడా అంతే సంఖ్యలో చికిత్స కోసం వెళ్తున్నారు. ఇలా చికిత్స కోసం వెళ్లిన వారిలో అధిక శాతం టైఫాయిడ్, మలేరియా, డెంగీ కేసులు ఉంటున్నాయి. కానీ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 161 మాత్రమే డెంగీ కేసులు నమోదు కాగా కేవలం ఆరు మాత్రమే మలేరియా కేసులు నమోదు అయినట్లు మలేరియా అధికారులు చెబుతున్నారు. మలేరియాలో 1,353 మందికి వ్యాధి లక్షణాలున్నట్లు అధికారులే నివేదికలు ఇస్తున్నారు. మరోవైపు కర్నూలు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో పదుల సంఖ్యలో ఇప్పటికీ డెంగీ కేసులకు చికిత్స చేస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోనూ పదికిపైగా మలేరియా లక్షణాలతో రోగులు చికిత్స పొందుతున్నారు. కానీ ఇవన్నీ డెంగీ, మలేరియా కేసులు కాదని అధికారులు చెబుతున్నారు. కేసులు అధిక సంఖ్యలో బయటపడితే తమ ఉద్యోగాలకు ఎక్కడ ఎసరు వస్తుందోనని వారు ఆందోళన చెంది కేసులు బయటపెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

నాడు ఇంటివద్దకే వైద్యం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సీజన్‌లో ఫీవర్ సర్వే ఇంటింటా నిర్వహించేవారు. జ్వర లక్షణాలున్న వారిని గుర్తించి ఇంటి వద్దే మందులు ఇచ్చి బాగు చేసేవారు. అవసరమైన వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స చేసేవారు. గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో రోగులకు అవసరమైన రక్త పరీక్షలు, ఈసీజీలతో పాటు 70 రకాల పరీక్షలు ఉచితంగా చేయించేవారు.

నేడు ఇలా..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్య వ్యవస్థను నిర్వీర్యం అయ్యింది. ప్రజలు సాధారణ దగ్గు, జలుబు, జ్వరంతో పాటు ఒళ్లునొప్పులు, తలనొప్పి, విరేచనాలు, వాంతులు తదితర క్షణాలతో చికిత్స కోసం వస్తున్నారు. ఎక్కువ శాతం ఓపీలోనే మందులు ఇచ్చి పంపిస్తుండగా కొద్దిమందిని మాత్రమే ఆసుపత్రిలో చేర్చుకుని చికిత్స అందిస్తున్నారు. డెంగీ, చికున్‌గున్యా వంటి జ్వరాలు పెరుగుతున్నా వైద్య సిబ్బందిని ప్రజల వద్దకు పంపడం లేదు. జాగ్రత్తలు చెప్పేవారు కరువయ్యారు.

'ప్రైవేటు' దోపిడీ

సాధారణ జ్వరంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళితే వివిధ రక్త పరీక్షలంటూ రూ.3వేలకు పైగా బిల్లు వేస్తున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు నిర్ధారణ గాకపోతే మళ్లీ స్కానింగ్, ఎక్స్‌రేలు తీయించి రోగుల జేబులు గుల్ల చేస్తున్నారు. ర్యాపిడ్ టెస్ట్‌లో డెంగీ పాజిటివ్ వచ్చిందంటే చాలు ఆసుపత్రిలో చేర్చుకుని రూ.50వేల దాకా వసూలు చేస్తున్నారు. ఈ ఖర్చులు భరించలేకే చాలా మంది జ్వరం రాగానే మెడికల్‌షాపులకు నేరుగా వెళ్లి మందులు కొని వాడే వారి సంఖ్య ఇటీవల కాలంలో ఎక్కువైంది.

“ ఆస్పరి పీహెచ్‌సీలో సౌకర్యాలు లేవు



ఆస్పరి పీహెచ్‌సీలో రోగులకు కనీస సౌకర్యాలు లేవు. కనీసం గర్భిణులకు పడకలు కూడా సరిపోవడం లేదు. ఆస్పరి మండలంలోని దాదాపు 25 గ్రామాల నుంచే గాకుండా దేవనకొండ, ఆలూరు, పత్తికొండ మండలాలకు చెందిన గ్రామాల వారు సైతం పలు వ్యాధులకు చికిత్స కోసం, ప్రసవాల కోసం ఇక్కడికే వస్తున్నారు. గర్భిణులకు పరీక్షల ల్యాబ్ లేకపోవడంతో ఆదోనికి వెళ్తున్నారు. వారికి ఇక్కడే ల్యాబ్ ఏర్పాటు చేయాలి. – రామాంజనమ్మ, చిరుమాన్‌దొడ్డి, ఆస్పరి మండలం

అవగాహన కల్పిస్తున్నాం



వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలు, సచివాలయాలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రుల్లో మలేరియా వ్యాధినిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నాం. జ్వరం వచ్చిన వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. మలేరియా/డెంగీ నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. మలేరియా, డెంగీ జ్వరాలు రాకుండా ఉండేందుకు ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. –నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

ఈ ఏడాది జిల్లాలో రోగుల వివరాలు

డివిజన్	మలేరియా(అనుమానిత)	డెంగీ	మెదడువాపు	చికున్‌గున్యా	బోదకాలు
కర్నూలు	4(635)	94	0	1	16
పత్తికొండ	0(195)	30	0	10	2
ఆదోని	1(523)	37	0	0	2
మొత్తం	5(1,353)	161	0	11	20

స్టేషన్లలోనే న్యాయం చేయాలి



సమావేశానికి హాజరైన డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు



మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, చిత్రంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్

కర్నూలు: పోలీస్‌స్టేషన్లలో న్యాయం జరిగితే బాధితులు ఉన్నతాధికారులను ఆశ్రయించే అవకాశం ఉండదని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు సీరియస్‌గా పనిచేస్తే ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఉండదని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో గురువారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలసి జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో అర్ధ వార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించి పోలీసు అధికారులతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్లలో సాంకేతికతను వినియోగించి నేర నియంత్రణకు గట్టిగా పనిచేయాలని క్షేత్రస్థాయి అధికారులను డీఐజీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్త పెండింగ్ కేసులను ఆరా తీశారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు బాగా పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, యాంటీ ఈవ్ టీజింగ్ తనిఖీలతో పాటు డ్రోన్ కెమెరాలతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులలో రికవరీ శాతం పెంచాలన్నారు. ఆయా కేసులలో నిందితుల వేలిముద్రలను సేకరించి కేసులను ఛేదించాలన్నారు. గత ఆరు నెలలుగా చోటు చేసుకున్న నేరాల విశ్లేషణ, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డీఎస్పీలు బాబుప్రసాద్, వెంకటరామయ్య, శ్రీనివాసాచారి, ఉపేంద్ర బాబు, హేమలత, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, సీఐలు, ఎస్‌ఐలు, ఈగల్ టీమ్ సిబ్బంది సమావేశంలో పాల్గొన్నారు.

'స్టాండింగ్' ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జయకేతనం!

- కర్నూలు కార్పొరేషన్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికలు
- ముగిసిన నామినేషన్ల పర్వం
- నామినేషన్లు వేసిన ఏడుగురు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు
- ఓటమి భయంతో దూరంగా టీడీపీ



నామినేషన్ సమర్పిస్తున్న 43వ వార్డు కార్పొరేటర్ మునెమ్మ

కర్నూలు (టౌన్): కర్నూలు కార్పొరేషన్‌లో స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం దాదాపు పూర్తయ్యింది. ఇక ఎన్నిక లాంఛనమే అయ్యింది. స్టాండింగ్ కమిటీకి సంబంధించిన నామినేషన్ల పర్వం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. గడువు ముగిసిన నాటికి వైఎస్సార్‌సీపీ చెందిన కార్పొరేటర్లు ఈ. నారాయణ రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, సీహెచ్ సాంబశివరావు, కురుబ మునెమ్మ, షేక్ అహమ్మద్, దండు లక్ష్మీకాంతా రెడ్డి, పి.షాషావలీ తమ నామినేషన్లు దాఖలు చేశారు. స్టాండింగ్ కమిటీకి ఐదుగురు సభ్యులు ఎన్నిక కావాల్సి ఉంది. అయితే వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు మద్దతుగా తమ నామినేషన్లు సమర్పించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అదనపు కమిషనర్ ఆర్జీవీ కృష్ణకు స్టాండింగ్ కమిటీకి పోటీచేసే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు తమ నామినేషన్లు సమర్పించారు. డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు చిట్టెమ్మ, రాజేశ్వర రెడ్డి, క్రిష్ణ కాంత్, విక్రమసింహారెడ్డి, నాగలక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. నామినేషన్లను ఈనెల 25న పరిశీలిస్తారు. అదే రోజు స్టాండింగ్ కమిటీలో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఈనెల 28 వరకు నామినేషన్లను ఉపసంహరించుకునే అవకాశం ఉంటుంది. ఆగస్టు 1వ తేదీ ఎన్నికలు నిర్వహించి, అదేరోజు ఓట్లను లెక్కించి విజయం సాధించిన అభ్యర్థులను అధికారికంగా ప్రకటిస్తారు.

టీడీపీకి ఓటమి భయం

నాలుగు సంవత్సరాల పాటు స్టాండింగ్ కమిటీలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తూ వచ్చింది. టీడీపీకి 8 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఒక ఇండిపెండెంట్, మరో 11 మంది కార్పొరేటర్లు టీడీపీలోకి చేరడంతో కౌన్సిల్‌లో వారి బలం 20 కి చేరుకుంది. దీంతో గత ఏడాది జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఇద్దరు టీడీపీ కార్పొరేటర్లను బరిలోకి దించింది. వీరికి మంత్రి టీజీ భరత్, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రజాప్రతినిధులు అండగా నిలిచినా ఓటమి పాలయ్యారు. ఓటమి భయంతో ఇద్దరు కార్పొరేటర్లను స్టాండింగ్ కమిటీ సభ్యులుగా పోటీలో నిలపాలని నిర్ణయించారు. నామినేషన్లు వేసేందుకు టీడీపీ కార్పొరేటర్లు పరమేష్, అబ్బాస్, ఫరాజ్ ఖాన్, కైపా పద్మాలతారెడ్డి తరలి వచ్చారు. ఇద్దరితో దరఖాస్తు పూర్తి చేయగా.. ఓ నేత ఫోన్ చేసి వద్దంటూ వారించారు. దీంతో ఎన్నికలకు దూరంగా ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ఏకగ్రీవం

స్టాండింగ్ కమిటీ ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసింది. బరిలో ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు పరిచారు. పోటీ చేస్తున్నట్లు హడావుడి చేసిన తెలుగుదేశం పార్టీ బరిలో నుంచి ఉపసంహరించుకుంది. దీంతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే ఏకగ్రీవం కానున్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం

- రైతులతో కలిసి పోరాటం చేస్తాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. కర్నూలులోని తన చాంబర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు 1,500 టన్నుల యూరియా వస్తే 50 శాతం మార్క్‌ఫెడ్‌కు, 50 శాతం ప్రైవేటు డీలర్లకు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే జిల్లాకు వచ్చిన మొత్తం యూరియాను ప్రైవేటు డీలర్లకు ఇవ్వడంతో వారు బ్లాక్ మార్కెట్ చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. వివిధ పంటలు సాగు చేసిన రైతులు యూరియా దొరకక ధర్నాలు చేయాల్సి వసోందన్నారు. నెల్లూరు నుంచి లారీల్లో యూరియాను తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారని ఆరోపించారు. కర్నూలు జిల్లా రైతులు సైతం కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి యూరియా తెచ్చుకోవాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం రైతులను నష్టాల్లో ముంచుతోందన్నారు.

అమరావతి తప్ప ఏమీ కనిపించవా?

కూటమి ప్రభుత్వానికి అమరావతి నిధులు రూ.లక్ష కోట్లు తప్ప ఇంకేమీ కనిపించడం లేదా అని ఎస్వీ ఎస్వీ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. రైతులు, నిరుద్యోగులు, ఉద్యోగులు.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నా సీఎం చంద్రబాబు మాత్రం అమరావతి జపం చేస్తున్నారని విమర్శించారు. రూ. లక్ష కోట్లలో 7 వేల కోట్లు కమీషన్ వస్తుందన్న కారణంతోనే ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారనే అనుమానాలు వస్తున్నాయన్నారు. అన్నదాతలకు అన్యాయం జరుగుతున్నా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎక్కడా పర్యటించరా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, లేనిపక్షంలో రైతులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఇలాకాలో రెండోసారి విజయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి



విజయ ర్యాలీలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య, కార్పొరేటర్లు

మంత్రి టీజీ భరత్ ఉన్న కర్నూలులో రెండోసారి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక అవుతున్నారని పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఓటమి భయంతోనే తెలుగుదేశం పార్టీ పోటీ నుంచి విరమించుకుందన్నారు. గురువారం సాయంత్రం కర్నూలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద మహానేత విగ్రహానికి పూల మాలలు వేశారు. ఘనంగా నివాళ్లు అర్పించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయం దాదాపు ఖరారు కావడంతో పెద్ద ఎత్తున్న బాణా సంచా కాల్చారు. స్వీట్లు పంపిణీ చేశారు. స్టాండింగ్ కమిటీకి పోటీ చేసిన మునెమ్మ, షేక్ అహమ్మద్, నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు, సాంబ శివరావులను పార్టీ జిల్లా అధ్యక్షులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. మేయర్ బీవై రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మాజీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మతో కలిసి పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడారు. మంత్రి నియోజకవర్గంలో రెండోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టాండింగ్ కమిటీ సభ్యులు సునాయసంగా గెలిచారన్నారు. గత ఏడాది అధికార పార్టీ ఎన్నో కుయుక్తులు, డబ్బు ఎర వేసిన వైస్సార్‌సీపీ అభ్యర్థులే గెలిచారని గుర్తు చేశారు. పార్టీ మరింత బలిష్ఠంగా ఉందని రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు నిర్వహించినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం ఖాయమన్నారు. తమ విజయానికి పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి కృషి చేశారని, వారికి కార్పొరేటర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు కతృజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ఎంపీఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జనవరి నెలలో జరిగిన ఎంపీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 82 మందికి గాను 67 మంది పరీక్షలు రాయగా 58 మంది ఉత్తీర్ణత సాధించారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. సప్లిమెంటరీ పరీక్షలకు 20 మంది హాజరు కాగా 15 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

డీసీసీబీలో పోస్టులకు 44 మంది ఎంపిక

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు (డీసీసీబీ)లో స్టాఫ్ అసిస్టెంటు పోస్టులకు 44 మంది ఎంపికయ్యారు. గత ఏడాది డీసీసీబీలో 50 స్టాఫ్ అసిస్టెంటు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. 37 పోస్టులు డైరెక్ట్, 13 పోస్టులు పీఏసీఎస్‌ల నుంచి భర్తీ చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఈ పోస్టుల భర్తీకి ముంబాయికి చెందిన ఐబీపీఎస్ ఈ ఏడాది ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించింది. రోస్టర్ వారిగా ఎంపికైన వారి వివరాలను ఐబీపీఎస్ డీసీసీబీకి పంపింది. డైరెక్ట్‌గా భర్తీ చేసే 37 పోస్టులకు 35 మందిని, పీఏసీఎస్‌ల నుంచి భర్తీ చేసే 13 పోస్టులకు 9 మంది ప్రకారం 44 మంది ఎంపిక అయ్యారు. డైరెక్ట్ పోస్టుల్లో 1 ఫిజికల్లీ ఛాలెంజ్డ్ పోస్టు, ఎక్స్ సర్వీస్‌మెన్ పోస్టుకు అర్హులు లభించలేదు. పీఏసీఎస్‌ల నుంచి భర్తీ చేస్తున్న వాటిలో నాలుగు పోస్టులకు అర్హులు లభించలేదు. ఆగస్టు 5న పీఏసీఎస్‌ల నుంచి ఎంపికైన 9 మందికి, ఆగస్టు 6న డైరెక్ట్‌గా ఎంపికైన 35 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సారి పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూ లేకపోవడం విశేషం.

పొలాల్లో చిరుత సంచారం


గంజిహళ్లి గ్రామ శివారులో చిరుత పాదముద్రలు

గోనెగండ్ల: మండలంలోని ఎన్నెకండ్ల, గంజిహళ్లి గ్రామ శివారులో మూడు రోజులుగా చిరుత పులి సంచారిస్తోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు భయందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పశువులను పొలాల్లో వేసుకున్న షెడ్లు, గుడిసెల్లో కట్టివేసి రాత్రి ఇంటికి వెళ్తున్నారు. మంగళవారం రోజు రాత్రి ఎన్నెకండ్ల గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర తన పొలంలో వేసిన షెడ్డు దగ్గర రెండు గేదేలు, రెండు దున్నపోతులను కట్టివేసి ఉంచాడు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా అందులో ఒక దున్నపోతు లేదు. నాగేంద్రతో పాటు పాడి రైతులు కొండ ప్రాంతంలో వెతకగా.. దున్నపోతు కళేబరం కనిపించింది. ఆ ప్రాంతంలో చిరుత అడుగు జాడలు కనిపించడంతో దున్నపోతును చిరుత దాడి చేసి తినిందని గుర్తించారు. గురువారం సాయంత్రం గంజిహళ్లి గ్రామ శివారులో చిరుత కనిపించడంతో గ్రామస్తులు తెలిపారు. దీంతో రాత్రి పూట పొలాల్లో ఉండేందుకు రైతులు భయపడుతున్నారు. అటవీ శాఖ అధికారులు చిరుత పులిని బంధించి అడవిలో వదిలి వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు తోలు రాముడు కోరారు.

శ్రావణం వచ్చింది.. పండగలు తెచ్చింది

- నేటి నుంచి శ్రావణ మాసం ప్రారంభం
- పండుగల సమాహారంతో ఆధ్యాత్మిక శోభ
- శ్రీశైలం, ఉరుకుంద క్షేత్రాల్లో ప్రత్యేక ఉత్సవాలు
- కొనసాగనున్న సామూహిక వ్రతాలు



భోగేశ్వరంలోని దుర్గా భోగేశ్వర ఆలయం

కర్నూలు కల్చరల్/కోవెలకుంట్ల/గడివేముల: శ్రావణ మాసం శుభదాయకమైంది. ప్రతి రోజు అత్యంత ప్రవిత్రమైందే. అత్యధిక పండుగలను ఈ మాసంలోనే జరుపుకుంటాం. నాగులచవితి, వరలక్ష్మీ వ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి ఇలా హిందువులకు అత్యంత ముఖ్యమైన ఈ పండుగలు బంధాలు, భాంధవ్యాలను తెలుపుతాయి. శ్రావణ మాసం అంటే చంద్రుడు శ్రావణా నక్షత్రంలోకి అడుగు పెట్టిన మాసం. నక్షత్రాల్లో శ్రావణా నక్షత్రం చాలా శుభదాయకం. అలాగే మాసాల్లో శ్రావణ మాసం మహా మహిమాన్వితం. ఎందుకంటే మిగతా మాసాల్లో కొన్ని తిథులు మాత్రమే శుభకరమైనవి. కావున శ్రావణ మాసంలో అన్ని తిథులు పవిత్రమైనవని చెప్పవచ్చు. విష్ణుమూర్తి నక్షత్రం కూడా శ్రవణా నక్షత్రమే. ఈనెలలో విష్ణుమూర్తి నక్షత్ర మండలంలో కొలువుదీరి ఉండటాన నభ మాసం అంటారు. శ్రావణ మాసం ఎంతో ఉత్కృష్టమైంది. మన సంస్కృతి సంప్రదాయాల్లో ఈనెల ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. రుతువులలో మూడోదైన వర్ష రుతువు ఈమాసంతోనే ప్రారంభమవుతుంది. వ్యవసాయ పరంగా కూడా ఈమాసం ప్రాముఖ్యం పొందింది. శ్రావణంలో గృహ నిర్మాణాన్ని ప్రారంభించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని మత్స్య పురాణం చెబుతోంది. శ్రావణ మాసం శుక్రవారం ప్రారంభం కానుంది.

శ్రావణ మాసంలో వచ్చే పండుగలు..

- శ్రావణ మాసంలో ఆచరించాల్సిన వ్రతాల్లో సోమవార వ్రతం ఎంతో విశిష్టమైంది. ఈ రోజున (ఈనెల 28, ఆగస్టు 4, 11, 18 తేదీలు) శివుని ప్రీత్యర్థం ఉపవాసం ఆచరించడంతో మంచి ఫలితాలను పొందవచ్చని వేద పండితులు చెబుతున్నారు.
- ఈ మాసంలో మరొక విశేషం ఏమిటంటే కొత్తగా పెళ్లైన స్త్రీలు ప్రతి మంగళవారం (29, ఆగస్టు 5, 12, 19 తేదీలు) మంగళ గౌరి వ్రతాన్ని నోచుకుంటారు. ఒక రాజకుమార్తె తన వైధవ్యాన్ని తొలగించుకోడానికి ఈ వ్రతము ఆచరించిందని పురాణాల ద్వారా తెలుస్తుంది.
- శ్రావణ శుక్రవారాలు లక్ష్మీ పూజకు అత్యంత ముఖ్యమైనవి.
- శావణ మాసంలోని మొదటి పండుగ నాగుల చవితి. దక్షప్రజాపతికి చిన్న భార్య అయిన కద్రువకు జన్మించిన సంతతే నాగజాతి. సుబ్రహ్మణ్య స్వామి ప్రతి రూపాలు. ఈ జాతిని పూజిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఇది పున్నమి ముందు అనగా శ్రావణమాసం ప్రార ంభమైన (28వ తేదీ) నాలుగవ రోజు వస్తుంది.
- మరుసటి రోజు ఆగస్టు (29వ తేదీ) గరుడ పంచమి. అనగా వినత కుమారుడు గరుత్మంతుడు తన తల్లి దాస్యము బాపుటకు స్వర్గానికి వెళ్లి అమృతం తెచ్చి కద్రువ సంతానమైన పాములకు పోసి దాస్య విముక్తి చేస్తాడు. గరుత్మంతుని జన్మదినమైన గరుడ పంచమి నోమును నోచుకుంటారు. పార్వతీదేవిని 'ఫణిగౌరి'తో పోల్చుకుని నోచుకొని తమ సోదరుల వద్దకు వెళ్లి వారి ఆశీస్సులు అందుకుంటారు.
- ఈ మాసంలో అతి ముఖ్యమైన పండుగ 'వరలక్ష్మి వ్రతం'. ఆగస్టు 8వ తేదీ ఈ పర్వదినాన్ని జరుపుకుంటారు. ఈ వ్రతాన్ని పార్వతీ దేవికి పరమేశ్వరుడే స్వయంగా చెప్పాడని శివపురాణం ద్వారా తెలుస్తుంది. ఈ వ్రతం శ్రావణ మాసం రెండవ శుక్రవారం వస్తుంది.
- తరువాత ముఖ్య మైంది 'శ్రావణ పూర్ణిమ'. దీనినే 'రాఖీ పూర్ణిమా' అంటారు. 9వ తేదీన రక్షా బంధన్ జరుపుకుంటారు. ఇదే రోజు హయగ్రీవ జయంతిని నిర్వహిస్తారు.
- మరొక ముఖ్యమైన పండుగ కృష్ణాష్టమి. ఇది శ్రావణమాసం కృష్ణ పక్షంలో అష్టమి రోజు (16వ తేదీ) వస్తుంది. శ్రీకృష్ణుడు దేవకీ, వసుదేవులకు అష్టమ గర్భంగా అర్ధరాత్రి జన్మించిన పర్వదినం. గీతాచార్యుడు అయిన శ్రీకృష్ణపరమాత్ముని జన్మదినాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా ఈ పండుగను అందరూ భక్తి శ్రద్ధలతో చేసుకుంటారు.

శ్రీశైలంలో..



శ్రావణ మాసంలో శ్రీశైల మహా క్షేత్రంలో 25వ తేదీ నుంచి నెలంతా విశేష పూజాధికాలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించనున్నారు. శ్రావణ సోమవారాలు, శుక్రవారాలు, శనివారాలు, ఏకాదశులు, శ్రావణ పౌర్ణమి, మాసశివరాత్రి, తదితర కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఉరుకుందలో..



ఉరుకుంద నరసింహ ఈరన్న స్వామి దేవస్థానంలో నెలంతా శ్రావణ మాసోత్సవాలు జరగనున్నాయి. సోమ, గురువారాలు స్వామి వారికి ప్రత్యేక రోజులు కావున ఆయా రోజుల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. నాల్గవ సోమవారం 18వ తేదీన స్వామివారికి పల్లకి ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు.

- కర్నూలు ఓల్డ్ సిటీలోని చిన్న అమ్మవారి శాల, పెద్ద అమ్మవారి శాల, లలితా పీఠం, నిమిషాంబదేవి ఆలయం, కాళికాంబ ఆలయం, వీఆర్ కాలనీ, కృష్ణానగర్, సంకల్ బాగ్‌లలోని వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

శుభ ముహూర్తాలు



ఈ నెలలో 26, 30, 31 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఈ నెల 31వ తేదీన పెద్ద ముహూర్తం కావడంతో పెళ్లిళ్లు పెద్ద సంఖ్యలో జరగనున్నాయి. ఆగస్టులో 1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 18, 14, 17 తేదీల్లో ముహూర్తాలున్నాయి. అలాగే, ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకూ భాద్రపదమాసం. ఇది శూన్యమాసం కావడంతో ముహూర్తాలు లేవు.

వ్రతాల వెనుక ఆరోగ్య రహస్యాలు



వరలక్ష్మి వ్రతం రోజు వాయనంగా ఇచ్చే మొలకెత్తిన శనగలు పోషక నిలయాలు. వీటిలో మాంసకృతులు తక్షణ శక్తిని ఇస్తాయి. నైవేద్యంగా ఆరగించే చలివిడి పండి చలువ చేస్తుంది. చలివిడి గర్భాధారణ అవరోధాలను తొలగిస్తుంది. అలాగే వర్షాకాలం పాదాలు ఎక్కువ సేపు తడిగా ఉండటం వల్ల ఇన్ఫెక్షన్ కలుగుతుంటాయి. ఇలా ఇన్ఫెక్షన్‌కు గురవ్వకుండా ఉండటం కోసమే కాళ్లకు పసుపు పూసుకోవటాన్ని ఈ వ్రతాల్లో భాగం చేస్తారు. ఆవు నెయ్యితో వెలిగించే దీపాల ద్వారా విడుదలయ్యే ధూపం వాయు కాలుష్యాన్ని హరిస్తుంది.

మోగనున్న కల్యాణ వీణ..



శ్రావణమాసం శుక్రవారం నుంచి ప్రారంభం కానుండటంతో పలు జంటలు వేదమంత్రాల సాక్షిగా ఏడడుగులు నడిచి జీవితాన్ని పంచుకునే శుభ ఘడియలు దగ్గరయ్యాయి. రెండు నెలల తర్వాత తిరిగి శుభ ముహూర్తాలు రావడంతో ఈ నెల 26వ తేదీ నుంచి కల్యాణ వీణ మోగనుంది. మాంగల్యం తంతునా..మమ జీవనం హేతునా.. కంఠేభద్నామి సుభగే..త్వంజీవశరశరం.. అంటూ పెళ్లిలో వినిపించే మంత్రాలు మార్మోగనున్నాయి. జిల్లాలోని మహానంది, యాగంటి, నయనాలప్ప, అహోబిలం, ఓంకారం, భోగేశ్వరం, శ్రీశైలం, బుగ్గరామేశ్వరం, తదితర పుణ్యక్షేత్రాలతోపాటు వివిధ ప్రాంతాల్లోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లలో పెళ్లిళ్లు జరుగనున్నాయి. ఇదే సమయంలో వస్త్ర, బంగారునగలు, తదితర పెళ్లి సామగ్రి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఒక పెళ్లి ఎందరికో ఉపాధి చూపుతోంది. వస్త్ర, బంగారు దుకాణాలతోపాటు పెళ్లి మండపాలు, ట్రావెల్స్, పురోహితులు, ఫొటోలు, వీడియో గ్రాఫర్స్, సాంస్కృతిక కళాకారులు, క్యాటరింగ్, ఎలక్ట్రీషియన్స్, బ్యాండుమేళం, పూలఅంగళ్లు, ఇలా ఎందరికో చేతి నిండి పని దొరుకుతోంది. ఆయా ముహూర్తాల్లో ఆయా కేటగిరిలకు చెందిన వారికి డిమాండ్ ఉండనుంది.

బంగారు వ్యాపారం పెరగవచ్చు



శ్రావణమాసం ప్రారంభంతో పెళ్లిళ్లు, వివిధ శుభకార్యాలకు మంచి రోజులు కావడంతో తప్పకుండా బంగారు ఆభరణాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఇప్పటికే ఉంగరం మొదలుకుని అన్ని రకాల నగలు కొనుగోలుకు ఆర్డర్లు ఇస్తున్నారు. తులం బంగారం ధర రూ. లక్షకు చేరువైనా కొందరు తమ స్థాయికి తగ్గట్టు కొనుగోలు చేస్తున్నారు.
– పెండేకంటి సుబ్రహ్మణ్యం, బంగారు నగల వ్యాపారి, కోవెలకుంట్ల

అడ్వాన్స్ బుక్ చేసేశారు



శ్రావణ మాసంలో ఏటా అధిక పెళ్లిళ్లు జరుగుతుండటంతో ఫంక్షన్‌హాళ్లనను ముందుగానే బుకింగ్ చేసుకుంటున్నారు. జూలై నెలలో మూడు, ఆగస్టు నెలలో 12 శుభమూహుర్తాలు ఉండటంతో ఆయా తేదీలకు సంబంధించి ఫంక్షన్‌హాల్స్‌కు అడ్వాన్స్ చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటున్నారు. చాలా మందికి ఉపాధి లభించనుంది. క్యాటరింగ్, కెమెరా, డెకరేషన్ తదితర రంగాల వారికి డిమాండ్ ఉండనుంది.
– శ్రీరాముల సుబ్బారెడ్డి, ఫంక్షన్‌హాలు యజమాని, కోవెలకుంట్ల

శ్రావణ మాసం అత్యంత పవిత్రం



శ్రావణ మాసం అత్యంత పవిత్రం, శుభకరం. ఈ మాసంలో ప్రతిరోజు పండుగే. సకలదేవతారాధనకు అనుకూలమైంది. మహిళలు ఈ మాసంలో ఉపవాసం ఉండి వివిధ రకాల నోములు, వ్రతాలు ఆచరిస్తారు. ముఖ్యంగా అన్నాచెల్లెళ్ల బంధాన్ని బలోపేతం చేసే రాఖీ పౌర్ణమి, శుక్రవారాల్లో లక్ష్మీ దేవిని సేవిస్తూ వరలక్ష్మీ వ్రతాన్ని నోమి సకల సుఖాలు కలగాలని వేడుకుంటారు. అత్తలు తమ కొత్త కోడళ్ల ఇంటికెళ్లి కొబ్బరి బెల్లం, నువ్వులు, ప్యాలపిండిని ఇచ్చి యోగ క్షేమాలు తెలుసుకుంటారు. – అగ్రహారం రాఘవేంద్ర ఆచార్యులు, పండితులు

పెద్దాసుపత్రిలో అరుదైన గుండె ఆపరేషన్


ఆపరేషన్ చేయించుకున్న యువతితో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): అరుదైన గుండెజబ్బుతో బాధపడుతున్న ఓ యువతికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గుండెజబ్బుల విభాగం వైద్యు లు ఆపరేషన్ నిర్వహించి ఊపిరిపోశారు. వివరాల ను గురువారం కార్డియోథొరాసిక్ హెచ్‌ఓడి డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి వివరించారు. ఆయన మాటల్లోనే.. 'శ్రీ సత్యసాయి జిల్లా సంగటివారి పల్లెకు చెందిన పూజిత(16) గుండె సమస్యతో ఈ నెల 4న కర్నూ లు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కార్డియోథొరాసిక్ విభాగానికి చికిత్స కోసం వచ్చింది. అన్ని పరీక్షల అనంతరం అరుదైన కన్‌స్ట్రక్టివ్ పెరికార్డైటిస్ అనే జబ్బు ఉన్నట్లు గుర్తించాం. ఈ నెల 14న ఆపరేషన్ చేశాం. ఆమెకు నాలుగు సంవత్సరాల నుంచి కడుపు వాపు, కాళ్ల వాపు ఉండటం వల్ల ఆపరేషన్ క్లిష్టంగా మారింది. చాలా జాగ్రత్తలు తీసుకుని ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. ఆపరేషన్ తర్వాత రెండు వారాల్లోనే కోలుకుంది. కడుపు, కాళ్లలో వాపు పోయి సాధారణ స్థితికి వచ్చింది. ఎవరికైనా కాళ్ల వాపులు, కడుపులో నీరు చేరుకుంటే వారికి కిడ్నీ, కాలేయ జబ్బులలో నార్మల్ అని తెలిస్తే ఇలాంటి గుండెజబ్బు కూడా ఉందని ప్రాథమిక వైద్యులు తెలుసుకోవాలి. సకాలంలో గుండెజబ్బుల డాక్టర్ దగ్గరకు పంపిస్తే ఆపరేషన్ సులభంగా చేసి ఇంటికి పంపించవచ్చు' అని ఆయన వివరించారు.

ఆర్థిక లావాదేవీలతో హత్య

- మిస్టరీ వీడిన బెల్ట్‌షాప్‌లో వ్యక్తి హత్య కేసు
- పది మంది నిందితుల అరెస్ట్
- నిందితుల్లో నలుగురు మైనర్లు
- రెండు పిడిబాకులు, మచ్చు కత్తి, సుత్తి, ఇనుప రాడ్ స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

పాణ్యం: ఐదు రోజుల క్రితం పాణ్యం గోరుకల్లు రస్తాలోని బెల్ట్‌షాప్‌లో జరిగిన హత్య కేసు మిస్టరీ వీడింది. ఆర్థికలావాదేవీల మధ్య నెలకొన్న వివాదంతోనే హత్య జరిగిందని పోలీసులు తేల్చారు. ఈ కేసులో 10 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా, అందులో నలుగురు మైనర్ బాలురు ఉన్నారు. గురువారం పాణ్యం సర్కిల్ కార్యాలయంలో సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నంద్యాలకు చెందిన అశోక్‌చౌదరి పాణ్యం గ్రామానికి చెందిన బెల్ట్‌షాప్ నిర్వాహకుడు ముసుగు సుబ్బయ్యకు రూ. 48 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఈ మొత్తంలో రూ. 26 లక్షలు సుబ్బయ్య తిరిగి చెల్లించాడు. ఇంకా రూ. 22 లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఆ డబ్బుల కోసం సుబ్బయ్యపై పదేపదే ఒత్తిడి తెచ్చాడు. దీంతో అశోక్‌చౌదరిని అంతమొందించాలని సుబ్బయ్య కుట్ర పన్నాడు. ఈ మేరకు డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని అశోక్‌చౌదరికి ఫోన్ చేయడంతో ఈనెల 20వ తేదీ రాత్రి 7.30 గంటలకు సుబ్బయ్య షాప్ వద్దకు చేరుకున్నాడు. కాగా పథకం ప్రకారం అశోక్‌చౌదరి కళ్లలో కారంచల్లి, తలపై సుత్తితో కొట్టి ఆపై కత్తితో ఛాతి, కడుపు, వీపున కత్తులతో పొడవటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఐదు రోజుల్లోనే నిందితులను అరెస్ట్ చేశారు. బెల్ట్‌షాప్ నిర్వాహకుడు ముసుగు సుబ్బయ్య, అతని కుమారుడు ముసుగు సురేష్, తెలుగుపేటకు చెందిన సల్కాపురం రమేష్, నూలుమిల్లు కాలనీకి చెందిన యనకండ్ల బాలకృష్ణ, మేకలబండకు చెందిన మండ్ల మణికుమార్, గోడన్ చెలు కాలనీకి చెందిన అనుపూరు మాబుఉసేన్‌తో పాటు నలుగురు మైనర్ బాలురు ఈ హత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. 13 –15 వయస్సులోపు ఉండే మైనర్లు చదువు మానేసి చిన్న చిన్న పనులు చేసుకుంటూ తిరిగేవారని, వీరిని ముసుగు సురేష్ వరుసగా రెండు రోజులు విందు ఇచ్చి మచ్చిక చేసుకుని, హత్యలో పాల్గొనేలా చేసినట్లు తెలిసింది. హత్యకు పాల్పడిన 10 మంది నిందితులను పిన్నాపురం రోడ్డులోని ఏరాసు ప్రతాప్‌రెడ్డి తోట వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. మైనర్లను బాలనేరస్తుల కారాగానికి తరలించినట్లు చెప్పారు. నిందితుల నుంచి రెండు పిడిబాకులు, మచ్చుకత్తి, ఇనుపరాడ్డు, సుత్తి, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

నీరొచ్చిన తర్వాత కాలువ పనులు


ప్రొక్లెయిన్‌తో కాలువలో పూడిక తొలగిస్తున్న దృశ్యం

హొళగుంద: తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ)కు నీరొచ్చిన తర్వాత హచ్చొళ్లి డిస్ట్రిబ్యూటరీ కాలువలో ప్రొక్లెయిన్‌తో పూడిక తొలగింపు పనులు ప్రారంభించారు. దీంతో గజ్జహళ్లితో పాటు కర్ణాటక పరిధిలోని గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలకు ముందు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. పనులు మొదలు పెట్టడంతో నేటికీ ఆయకట్టు భూములకు నీరు అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు మరో నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయని చెబుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం


పట్టుబడిన మద్యాన్ని జేసీబీతో ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ సీఐ, పోలీసులు

ఆదోని రూరల్: ఆదోని ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యాన్ని కర్నూలు ఏఈఎస్ రామకృష్ణారెడి ఆధ్వర్యంలో ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్ గురువారం తెలిపారు. మొత్తం 2,055 లీటర్ల కర్ణాటక మద్యాన్ని జేసీబీ సాయంతో ధ్వంసం చేయడం జరిగిందన్నారు. వీటి విలువ రూ.12 లక్షలు దాకా ఉంటుందన్నారు. అలాగే 17 కేసుల్లో 177 లీటర్ల నాటుసారా సీజ్ చేయగా, దానిని కూడా నశింపజేసినట్లు చెప్పారు.

వేధింపులు లేవు.. విభేదాలు తొలగాయి

- జిల్లా అధికారుల విచారణలో వెలుగు చూసిన వాస్తవాలు


విచారణ చేస్తున్న జిల్లా శిశుసంక్షేమ అధికారులు

మద్దికెర: తన కుమారుడికి తల్లి అన్నం పెట్టడం లేదు.. అవ్వాతాతలు నిద్ర పోనియ్యడం లేదు.. అని మూడు నెలల క్రితం తండ్రి చరణ్‌కుమార్ జాతీయ బాలల పరిరక్షణ కమిషన్‌కు మెయిల్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో శిశు సంక్షేమశాఖ జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ టి.శారద, లీగల్ కం ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి గురువారం మండల కేంద్రమైన మద్దికెరకు వచ్చారు. బాలుడి అవ్వతాతలు, చుట్టుపక్కల వారిని విచారించగా.. బాలుడికి వేధింపులు లేవని తేలింది. భార్యాభర్తల మధ్య విభేదాలు తొలగాయని తెలిసింది. వివరాలు.. మద్దికెర గ్రామానికి చెందిన వరలక్ష్మిని గుంతకల్లు పట్టణానికి చెందిన చరణ్‌కుమార్‌కు ఇచ్చి 2021లో వివాహం చేశారు. రెండేళ్లకు భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. దీంతో భార్య కాన్పుకు పుట్టింటికి వచ్చి కుమారుడికి జన్మనిచ్చింది. రేండేళ్ల పాటు పుట్టింట్లో ఉన్నా భర్త పట్టించుకోలేదు. అయతే తన కుమారుడిని వేధిస్తున్నారని బాలుని తండ్రి చరణ్‌కుమార్ జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించి భార్యాభర్తలకు సర్దిచెప్పారు. మూడు నెలల కిందట చేసిన ఫిర్యాదుకు సంబంధించి జిల్లా అధికారులను విచారణకు వచ్చారు. అయితే భార్యాభర్తలు కలిసి పోయారని అమ్మాయి తల్లిదండ్రులు చెప్పడంతో అధికారులు వెంటనే ఫిర్యాదుదారుడిని ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలని తెలియజేశారు. వీరి వెంట తహసీల్దార్ గుండాల నాయక్, సీడీపీఓ లలిత ఉన్నారు.

విష గుళికలు చల్లుతూ..

- 11 మంది కూలీలకు అస్వస్థత


చికిత్స పొందుతున్న కూలీలు

ఆదోని అర్బన్: హొళగుంద మండలం చిన్నగోనేహాల్ గ్రామంలో మొక్క జొన్న పంటకు విష గుళికలు చల్లుతూ గురువారం 11 మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితులు తెలిపిన వివరాలు.. చిన్నగోనేహాల్ గ్రామంలో 10 ఎకరాల మొక్కజొన్న పంటకు 11 మంది కూలీలు విషగుళికలు చల్లుతుండగా అందులో రంగస్వామి, నాగరాజులు వాటి వాసన పీల్చి వాంతులు అయ్యి అస్వస్థతకు గురయ్యారు. దీంతో మిగతా 9 మందికి కూడా వాటి వాసనకు గురవుతారని తెలుసుకుని వెంటనే వారిద్దరితో పాటు మరో 9 మందిని ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎలాంటి ప్రాణాపాయం లేకుండా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత


తల్లిదండ్రులతో బాలుడు

శ్రీకాళహస్తి: సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదని 15 రోజుల క్రితం ఇంటి పారిపోయిన కిరణ్(15)ను పోలీసులు గురువారం అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ నాగార్జునరెడ్డి కథనం మేరకు.. డోన్‌కు చెందిన కిరణ్ అనే బాలుడు సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదన్న కోపంతో ఇంటి నుంచి 15 రోజుల క్రితం వచ్చేశాడు. రెండు రోజుల క్రితం అదిలాబాద్ నుంచి తిరుపతికి వెళుతున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో ఓ టీవీ రిపోర్టర్ గుర్తించి, అతడి వద్ద వివరాలు ఆరా తీసింది. దీంతో శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులకు గురువారం అప్పగించాడు. పోలీసులు విచారణ జరిపి డోన్‌కు చెందిన బాలుడిగా గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి, వారిని పిలిపించి, విద్యార్థికి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించారు.

బెంగళూరుకు చెందిన మహిళగా గుర్తింపు

మంత్రాలయం రూరల్ : మంత్రాలయం వద్ద తుంగభద్ర నదిలో కొట్టుకు వచ్చిన మృతదేహం కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మంగళమ్మ (68)గా గుర్తించినట్లు ఎస్ఐ శివాంజల్ తెలిపారు. సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలుసుకున్న ఆమె కుమారుడు రాఘవేంద్ర, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రాలయం వచ్చి ఆమె గుర్తించారు. రెండు నెలల క్రితం ఆమె చెల్లెలు గంగమ్మ మృతి చెందడంతో మనస్తాపానికి గురై ఈనెల 22న తెల్లవారుజామున ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వచ్చిందన్నారు. ఈ మేరకు 23వ తేదీన బెంగళూరు మహాలక్ష్మీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అంతలో మంత్రాలయం తుంగభద్రనదిలో మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. మృతదేహానికి ఎమ్మిగనూరు హాస్పిటల్‌లో పోస్టుమార్టం చేసిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.